సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం, 10, ఆగస్టు, 2024



కుట్టుమిషన్లు ఎప్పడిస్తారో?

మంజూరై ఏడాది గడుస్తున్నా కుట్టు మిషన్లను పంపిణీ చేయకపోవడంతో మైనార్టీ మహిళలు ఎదురుచూస్తున్నారు.

8లో



ఖజానా కళకళలాడేలా..

ఆదాయం వచ్చే ఏ మార్గాన్నీ వదులుకోకుండా ఆర్టీసీ యాజమాన్యం, అధికారులు అడుగులు వేస్తున్నారు.

8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం జల్లులు పడే అవకాశం ఉంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను ఇనుమడింపజేయాలి



డీఎస్పీ రవీందర్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

మణుగూరు టౌన్: ఫిర్యాదుదారులతో గౌరవంగా ప్రవర్తిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను ఇనుమడింపజేయాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. శుక్రవారం మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ సతీష్ కుమార్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలకగా, సిబ్బంది నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలను కలియతిరిగి లాకప్ రూంను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న పోలీస్ స్టేషన్ భవనాన్ని సందర్శించారు. ఆ తర్వాత డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు మేడ ప్రసాద్, రంజిత్‌లతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బ్లూకోల్ట్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రివేళ పెట్రోలింగ్‌తో పాటు ఇటీవల సీజ్ చేసిన గంజాయి వివరాలు, పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కిన్నెరసాని ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలకు కిన్నెరసాని జలాశయంలోకి వరదనీరు వచ్చి చేరుతోంది. 407 అడుగుల నీటి నిల్వసామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువనుంచి 2,800 క్యూసెక్కుల వరదనీరు రావడంతో శుక్రవారం నీటిమట్టం 405.80 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్ట్‌కు చెందిన ఒక గేటును రాత్రి ఎత్తివేసి 5 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

పోస్టల్ సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్

అన్నపురెడ్డిపల్లి: గ్రామీణ ప్రాంత పోస్ట్ ఆఫీసుల్లో అందిస్తున్న పలురకాల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ కోరారు. శుక్రవారం మండలంలోని పెద్దిరెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన డీసీడీపీ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. పోస్టాఫీస్‌ల్లో అందించే పీఓఎస్‌బీ, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ తదితర సేవలను వివరించారు. అతి తక్కువ ప్రీమియం రూ.520లతో, రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం పొందవచ్చని తెలిపారు. అధికారులు, సిబ్బంది సత్యనారాయణ, రాజేంద్ర నాయక్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసీలకు
అండగా ఉంటాం

- విద్యపై దృష్టి సారిస్తే ఉన్నత శిఖరాలకు..
- ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ జితేష్
- మన హక్కులను రక్షించుకుందాం : ఎమ్మెల్యే తెల్లం



కొమ్మునృత్యం చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

భద్రాచలంఅర్బన్: అడవి నుంచి సంపద సృష్టించుకోవాలని, అందుకు తాము అండగా ఉంటామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఐటీడీఏ పరిధిలోని గిరిజన భవన్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత ఐటీడీఏ పీఓ రాహుల్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆదివాసీ జెండాను ఆవిష్కరించి, మన్యం వీరులు, అంబేద్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ నుంచి బ్రిడ్జి సెంటర్ మీదుగా ఐటీడీఏ రోడ్డులోని గిరిజన భవనం వరకు ఆదివాసీ సంప్రదాయ కొమ్ము, నాయకపోడు నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. కళాకారులు, గిరిజన పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. ఆ తర్వాత విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాష నేర్చుకునేందుకు తనకు ఐదేళ్లు పట్టిందని, త్వరలోనే కోయ భాషను కూడా నేర్చుకుంటానని పేర్కొన్నారు. గతంలో మీరే అడవిని కాపాడారని, ఇప్పుడు మీరే నరుకుతున్నారని, దానిని రక్షించుకోవాల్సిన బాధ్యత మీదేనని వివరించారు. ఆదివాసీలు విద్యపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

సంస్కృతీ సంప్రదాయాలు నేర్పాలి

ఆదివాసీలు తమ పిల్లలకు సంస్కృతీ సంప్రదాయాలు, భాషలోని ప్రాముఖ్యతను నేర్పించాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సూచించారు. ఆదివాసీలు తక్కువ మంది మాత్రమే భాషలో మాట్లాడతారని, దీనివల్ల మన భాష సంస్కృతి, సంప్రదాయాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని అన్నారు. అమెరికా ప్రజలు కూడా తెలుగు మాట్లాడేందుకు ప్రయత్నిస్తారని, అయినా వారి సంప్రదాయానికి భంగం కలిగించుకోరని పేర్కొన్నారు. అలాగే ఆదివాసీ కుటుంబాలు తమ సంస్కృతిని, హక్కులను కాపాడుకోవాలని అన్నారు. ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ ఆదివాసీల మనస్సు స్వచ్ఛమైనదని ఎస్పీ బి.రోహిత్‌రాజు అన్నారు. ఆదివాసీ ఆడబిడ్డలు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రదేశాలకు



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

వెళ్తే ప్రపంచం అంటే ఏమిటో తెలుస్తుందని అన్నారు. బాల్య వివాహాలు ఆగాలంటే బాలికలు చదుకోవాలని చెప్పారు. గిరిజన యువకులు చెడు స్నేహాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ప్రభుత్వం కల్పించే వసతులను సద్వినియోగం చేసుకుని బంగారు బాటలో పయనించాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దుమ్ముగూడెం మండలంలో రూ. 2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నట్లు తెలిపారు.

ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీలను అన్ని విధాలా ఆదుకోవాలని, పక్కా ఇళ్లు నిర్మించాలని, డీఎస్సీలో ఏజెన్సీలో ఉన్న ఆదివాసీలకు అవకాశం కల్పించాలని, ఆదివాసీలకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రావీణ్యం సాధించినవారిని కలెక్టర్ జితేష్, ఎస్పీ రోహిత్‌రాజు, పీఓ రాహుల్, ఎమ్మెల్యే వెంకట్రావు సన్మానించారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీల విజేతలకు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు మణెమ్మ, రమణయ్య, అశోక్, తానాజీ, భాస్కర్, నాగార్జున రావు, దావీద్, ఆదినారాయణ, శ్రీనివాస్, గిరిజన సంఘాల నాయకులు పూణే కృష్ణ దొర, పాయం రవి వర్మ, శరత్ బాబు, మురళి, రమేష్, పుల్లయ్య, వీరస్వామి, శ్రీరామ్ మూర్తి, సుధారాణి, అరుణ, వెంకటరావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థినికి సన్మానం

గుండాల: ఎస్టీ కేటగిరీలో నీట్ ర్యాంకు సాధించిన ఆదివాసీ విద్యార్థినిని హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సన్మానించారు. గుండాల మండలం మారుమూల గ్రామమైన పాలగూడేనికి చెందిన వజ్జ వీరకుమారి 2023–24 విద్యాసంవత్సరంలో నిర్వహించిన నీట్ ఎంట్రన్స్‌లో ఎస్టీ కేటగిరీలో అత్యధిక మార్కులు సాధించింది. 720 మార్కులకుగాను 491 మార్కులు సాధించి ప్రతిభ చాటింది. దీంతో గిరిజన సంక్షేమ శాఖ తరఫున హైదరాబాద్‌లో శిశు సంక్షేమ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల



విద్యార్థినిని సన్మానిస్తున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్, మంత్రి సీతక్క తదితరులు

మీదుగా సన్మానించారు. ప్రభుత్వ బహుమతిగా షీల్డ్ అందించారు. వీరకుమారి ని ఆదర్శంగా తీసుకుని ఆదివాసీ పల్లెల యువత చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని మండల అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

ఇగ్గవాసి మంద నోర్‌కీ..

- ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు కెచ్చాను
- కోయ భాషలో ప్రసంగించిన భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలంఅర్బన్: 'ఇగ్గవాసి మంద నోర్‌కీ.. ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు కెచ్చాను' అంటూ భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ కోయ భాషలో మాట్లాడి ఆకట్టుకున్నారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా భద్రాచలంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగాన్ని కోయ భాషలో మొదలుపెట్టడంతో అధికారులు సహా నాయకులు ఆశ్చర్యపోయారు. ఈసందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టామని, విద్యార్థులు సంస్కృతిని కాపాడుకుంటూనే చదువుపై దృష్టి సారించాలని చెప్పారు. అలాగే, ఆదివాసీ గిరిజనులు ఆర్థికంగా స్థిరపడేలా చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు ఇస్తున్నామని, త్వరలోనే భద్రాచలంలో ఇప్పపూవు నూనె తయారీ యంత్రాన్ని నెలకొల్పుతామని తెలిపారు. గిరిజనులకు ఏ సమస్య వచ్చినా నేరుగా తననే సంప్రదించవచ్చంటూ నాలుగు



ఆదివాసీ వేషధారణలో భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

నిమిషాల పాటు కోయ భాషలో మాట్లాడి తన ప్రసంగాన్ని ముగించారు. భద్రాచలం ఐటీడీఏ పీఓగా జూన్ 24న బాధ్యతలు స్వీకరించిన రాహుల్ కేవలం 45 రోజుల వ్యవధిలోనే కోయ భాష నేర్చుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అనంతరం మాట్లాడిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ తాను తెలుగు నేర్చుకోవడానికి ఐదేళ్లు పడితే పీఓ తక్కువ సమయంలో కోయ భాష నేర్చుకోగలిగారని తెలిపారు. త్వరగా తాను కూడా ఆ భాష నేర్చుకుంటానని వెల్లడించారు.

మహిళా సాధికారతకు కృషి

- విరివిగా మొక్కలు నాటాలి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

చుంచుపల్లి/జూలూరుపాడు: మహిళా సాధికారిత సాధించేందుకు రాబోయే ఐదేళ్లలో చిరువ్యాపారాలను ప్రోత్సహించడంతోపాటు సంఘాల సభ్యులకు నైపుణ్యంలో శిక్షణ, ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మినీ ఇండస్ట్రీయల్ పార్క్, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు సమకూర్చుతామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాలో తొలిసారిగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆయన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి ప్రారంభించారు. మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లోని తినబండారులను స్వయంగా పరిశీలించారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చాతకొండ బీట్ పరిధిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఐదు క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని, తొలుత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామని వివరించారు. మహిళా శక్తి క్యాంటీన్లలో ఆహారం అమ్మ చేతి వంటలా ఉండాలని, నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని నిర్వాహకులకు సూచించారు. మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ



కలెక్టరేట్‌లో మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ధ్యేయమని అన్నారు. గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో అంతటా విరివిగా మొక్కలు నాటాలన్నారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది అడవులను సంరక్షించాలన్నారు. జిల్లాలో కొత్తగా పోడు వ్యవసాయం చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోడు వ్యవసాయం చేసే రైతులకు అటవీశాఖ అధికారులు జామాయిల్ పెంపకం తదితర పంటలపై అవగాహన కల్పించాలన్నారు. అటవీ శాఖ అధికారులు పోడు వ్యవసాయం నిర్వహిస్తున్న గిరిజనులతో స్నేహభావంగా ఉండాలని చెప్పారు. గిరిజనుల దాడిలో మరణించిన ఎఫ్ఆర్వో చెలమల శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు 500 గజాల ఇంటి స్థలం పట్టాను త్వరలో అందజేస్తామని మంత్రి తెలిపారు.

సీతారామ కాల్వ పరిశీలన

జూలూరుపాడు మండలంలోని సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌ను శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళ్తూ జూలూరుపాడులోని ఒంటిగుడిసె క్రాస్ రోడ్ నుంచి వినోభానగర్ గ్రామ సమీపం వరకు సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ, ఏన్కూరు లింక్ కెనాల్ పనుల పురోగతిని పరిశీలించారు. కొంత దూరం కాలినడకన, ఆ తర్వాత సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాక్టర్‌ను స్వయంగా నడుపుతూ ఏన్కూరు లింక్ కెనాల్ పనులను పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కెనాల్ పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్(ఐడీసీ) చైర్మన్ మువ్వా విజయబాబు, కలె



సీతారామ లింక్ కెనాల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి

క్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, సీసీఎఫ్ డి.భీమా నాయక్, జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణాగౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్డీఓ విద్యాచందన, ఇరిగేషన్ ఎస్ఈ ఎస్ శ్రీనివాసరెడ్డి, ఈఈ బి.అర్జున్, డీఈ చంద్రశేఖర్, ఏఈ సాగర్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనా రెడ్డి పాల్గొన్నారు.


పోలీసుల అదుపులో కీలక మావోయిస్టు?

- పేలుడు పదార్థాలు సరఫరా చేసినట్టుగా అనుమానం
- గుట్టుగా విచారణ చేస్తున్న జిల్లా పోలీసులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నిషేధిత భారత కమ్యూనిస్టు (మావోయిస్టు) పార్టీకి సహకారం అందించే కీలక వ్యక్తి జిల్లా పోలీసుల అదుపులో ఉన్నట్టుగా ప్రచారం జరుగుతోంది. జిల్లాకు చెందిన ఓ వ్యక్తి నాలుగేళ్ల కిందట సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణం, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణ పనుల్లో భారీ యంత్రాలను నడిపే డ్రైవర్‌గా పని చేశారు. గోదావరి తీరంలో పని చేస్తున్న సమయంలో మావోయిస్టు పార్టీ విధానాల పట్ల ఆకర్షితుడై ఆ పార్టీకి సానుభూతిపరుడిగా మారినట్టు తెలుస్తోంది. అజ్ఞాతంలోకి వెళ్లకుండా సామాన్య పౌరుడిగా ఉంటూ అవసరమైనప్పుడు మావోయిస్టులకు సహాయపడుతుండే వాడిగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు వారాల క్రితం ఆంధ్రప్రదేశ్ – కర్నాటక రాష్ట్ర సరిహద్దులో ఐరన్ ఓర్ క్వారీలు ఎక్కువగా ఉండే ప్రాంతంలో సదరు వ్యక్తి సంచరిస్తుండగా అనంతపురం జిల్లా పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రాథమిక విచారణలో పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో అప్రమత్తమైన అనంతపురం పోలీసులు భద్రాద్రి జిల్లా పోలీసులకు సమాచారం ఇచ్చినట్టుగా విశ్వసనీయ సమచారం. దీంతో సదరు వ్యక్తిని జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్టు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు చేపట్టిన విచారణలో సదరు వ్యక్తి మావోయిస్టులకు పేలుడు పదార్థాలు సరఫరా చేయడంలో సాయం అందిస్తున్నట్టుగా తేలినట్టు ప్రచారం జరుగుతోంది. గత వేసవిలో పోలీసులు, భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన పలు పేలుళ్ల వెనుక ఎవరెవరి పాత్ర ఉందనే అంశంపై అదుపులో ఉన్న అనుమానిత వ్యక్తి నుంచి మరింత సమాచారం సేకరించే పనిలో పోలీసు వర్గాలు ఉన్నట్టు తెలుస్తోంది.

'భద్రాచలం-మల్కాన్‌గిరి'కి గ్రీన్ సిగ్నల్

- రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం
- ప్రకటించిన రైల్వేమంత్రి అశ్వనీవైష్ణవ్



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులకు కేంద్రం శుభవార్త ప్రకటించింది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం మీదుగా వెళ్లే రైలు మార్గం నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పూర్వోదయ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గిరిజన ప్రాంతాల మీదుగా వెళ్లే ఎనిమిది రైల్వే లైన్లను నిర్మించాలని ప్రధాని మోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇందులో మల్కాన్‌గిరి నుంచి భద్రాచలం మీదుగా పాండురంగాపురం వరకు 173 కి.మీ. లైను కూడా ఉన్నట్టు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. ఈ సమావేశంలో మొత్తం ఎనిమిది కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించింది.

అసన్‌సోల్ టూ వరంగల్

పూర్వోదయ పథకంలో భాగంగా ప్రకటించిన రైల్వే లైన్లలో ఒడిశా మీదుగా వెళ్లే మూడు ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే తూర్పు తీరంలో మరో ప్రధాన రైలు మార్గం అందుబాటులోకి వచ్చినట్టు అవుతుంది. ప్రస్తుతం రవాణా పరంగా అసన్‌సోల్ – హౌరా (కోల్‌కతా) – విశాఖపట్నం – విజయవాడ – కాజీపేట మార్గం కీలకంగా ఉంది. దీనికి ప్రత్యామ్నాయంగా మల్కాన్‌గిరి – భద్రాచలం – పాండురంగాపురం రైల్వేలైను అందుబాటులో వస్తుంది. అప్పుడు పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి వరంగల్ వరకు రెండో రైలు మార్గం అందుబాటులోకి వస్తుంది. దీంతో తూర్పు తీర ప్రాంతానికి దేశంలోని దక్షిణ, మధ్య, పశ్చిమ ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుంది. తూర్పు తీరంలో తుపానులు భారీ వర్షాల కారణంగా సమస్య తలెత్తినా రవాణా పరంగా ఇబ్బందులు ఉండవు.

అభివృద్ధికి ఊతం

మల్కాన్‌గిరి – పాండురంగాపురం రైల్వే లైను నిర్మాణం జరిగితే ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఏపీలో అల్లూరి జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కనెక్టివిటీ పెరుగుతుంది. ఫలితంగా గిరిజన జనాభా అధికంగా ఉన్న ఈ ప్రాంతాల్లో ఆర్థిక, పర్యాటక, ఉపాధి, ఖనిజాల రవాణా, విద్యుత్ రంగాల్లో అభివృద్ధి పట్టాలెక్కుతుందని కేంద్రం భావిస్తోంది. మల్కాన్‌గిరి (జునాగఢ్) నుంచి పాండురంగాపురం వరకు మొత్తం 173 కి.మీ నిడివితో నిర్మించే ఈ మార్గానికి రూ.3,592 కోట్లు ఖర్చు అవుతుందని ఇప్పటికే రైల్వే శాఖ చేపట్టిన ఫైనల్ లోకేషన్ సర్వేలో తేలింది.

అనూహ్యంగా

ఎన్డీఏ-2 ప్రభుత్వ హయాంలో మల్కాన్‌గిరి – భద్రాచలం – పాండురంగాపురం రైల్వే లైను తెర మీదకు వచ్చింది. ఆ వెంటనే పలు సర్వేలు జరిగాయి. 2023 సెప్టెంబరులో ఫైనల్ లోకేషన్ సర్వే కూడా పూర్తయింది. ఇక నిర్మాణ పనులకు సంబంధించిన ప్రకటన ఈ ఏడాది ఫిబ్రవరి, జూలై నెలల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో ఉంటుందనే అంచనాలు నెలకొన్నాయి. కానీ ఆ విధంగా రైల్వే నుంచి ప్రకటన రాలేదు. దీంతో ఎప్పటిలాగే మిగిలిన రైలు మార్గాల తరహాలోనే భద్రాచలం కూడా దీర్ఘకాలం పెండింగ్‌లో ఉండిపోతుందనే అభిప్రాయం బలపడింది. కానీ అనూహ్యంగా ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ మార్గానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

రైల్వే మంత్రి పట్టుదల

ప్రస్తుతం రైల్వేమంత్రిగా ఉన్న అశ్వినీ వైష్ణవ్ ఒడిశాకు చెందిన వారు కావడంతో ఆ రాష్ట్రానికి సంబంధించిన రైలు మార్గాల నిర్మాణంపై ఆయన పట్టుదలతో ఉన్నారు. అందువల్లే భద్రాచలం – మల్కాన్‌గిరి మార్గానికి అనుకూలత ఏర్పడిందనే వాదనలు ఉన్నాయి. కాగా గిరిజన ప్రాంతాలను కలిపే మణుగూరు – కిరండోల్ (ఛత్తీస్‌గఢ్), మణుగూరు – రామగుండం రైల్వే లైన్ల విషయంలో కేంద్రం నుంచి సానుకూల ప్రకటన రాకపోవడం కొంత నిరాశ కలిగించింది.

సర్వజన ఆస్పత్రిలో ఏదీ శుభ్రత?

- వాష్ రూమ్‌లలో నీళ్ల కొరత
- రోగులు, వైద్య సిబ్బందికి ఇబ్బందులు
- ఆస్పత్రి చుట్టూ డ్రెయినేజీ నీరు నిల్వ
- సీఎంఓ పోస్టులు ఖాళీ

కొత్తగూడెంరూరల్: జిల్లాలో సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వర పీడితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. వైద్యారోగ్య శాఖ అధికారులు గ్రామాల్లో తిరుగుతూ పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. కానీ జిల్లా సర్వజన ఆస్పత్రి ఆవరణలో అపరిశుభ్రత నెలకొంది. వాష్ రూమ్‌లలో నీటి కొరత ఏర్పడింది. దీంతో రోగులు, వారి సహాయకులు వాష్ రూమ్‌కు వెళ్లటానికి ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో రోజూ 600 నుంచి 700 వరకు ఓపీ ఉంటుంది. ఇందులో 50 మంది వరకు జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలతో ప్రతిరోజు అడ్మిట్ అవుతున్నారు. ఆస్పత్రిలో వైద్య సేవలందించేందుకు 70 వైద్యులు అందుబాటులో ఉన్నారు. కానీ క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్(సీఎంఓ) పోస్టులు 7 ఖాళీగా ఉన్నాయి. కాగా ఉన్న వైద్యులతోనే సేవలందిస్తున్నట్లు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రాధామోహన్ తెలిపారు.

వైద్య సేవలు మెరుగ్గా ఉన్నా..

వాష్ రూమ్‌లలో నీళ్లు లేకపోవడంతో విషజ్వరాలు, ఇతర రోగాలతో ఆస్పత్రికి వచ్చినవారు బయటకు వెళ్తున్నారు. నీటి కొరత కారణంగా ఆయా వార్డుల్లో దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆస్పత్రిలో



జిల్లా సర్వజన ఆస్పత్రి

విధులు నిర్వర్తిస్తున్న నర్సింగ్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది సైతం వాష్ రూమ్‌కు వెళ్లాలంటే అవస్థ పడుతున్నారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో మేల్, ఫీమేల్ మెడికల్ వార్డులు, సర్జికల్ వార్డులు ఉన్నాయి. వీటిల్లో వైద్య సేవలు మెరుగ్గా ఉన్నా పారిశుద్ధ్యం కొరవడుతోంది. ఆస్పత్రిలో ఉన్న బోర్ల నుంచి వచ్చిన నీరు సరిపోవటం లేదు. వాటర్ ట్యాంకులు నిండితే రెండు, మూడు గంటలు మాత్రమే వాష్ రూమ్‌లకు నీళ్లు వస్తున్నాయి. మిగతా సమయంలో వాటర్ ఉండటం లేదు. దీంతో ఆస్పత్రికి వస్తే ఆరోగ్య సమస్యలు తగ్గకపోగా ఇంకా పెరిగే పరిస్థితి నెలకొంది.

ఆస్పత్రి చుట్టూ మురుగునీరు నిల్వ

జిల్లా సర్వజన ఆస్పత్రి చుట్టూ డ్రెయినేజీ నీరు నిలిచి ఉంది. దుర్గంధం వెదజల్లుతుండగా రోగులు, వారి సహాయకులు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సైతం ముక్కు మూసుకుని ఆస్పత్రిలోకి వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్యను కలెక్టర్, డీఎంఈ దృష్టికి తీసుకెళ్లగా, ఉన్నతాధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. డ్రెయినేజీ వాటర్ బయటకు పంపేలా పైపులైన్ నిర్మాణానికి



ఆస్పత్రి ఆవరణలో నిలిచిన డ్రెయినేజీ నీరు

ఆస్పత్రి అధికారులు సర్వే చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. డ్రెయినేజీ పైపులైన్ తమ ఇళ్ల ముందు నుంచి నిర్మించొద్దని ఆస్పత్రి చుట్టుపక్కలవారు నిరసన తెలిపారు. దీంతో డ్రెయినేజీ సమస్య పరిష్కారం కాలేదు. సెప్టిక్ ట్యాంక్ లీకై రోజూ మురుగు నీరు ఆస్పత్రి ఆవరణ నుంచి రోడ్డుపైకి చేరుతోంది. రోడ్డుపై రాకపోకలు సాగించేవారికీ ఇబ్బందులుతప్పడంలేదు.

త్వరలో సమస్యల పరిష్కారం



జిల్లా సర్వజన ఆస్పత్రిలోని వాష్ రూమ్‌లకు నీటి కొరత త్వరలో పరిష్కారమవుతుంది. కొన్ని వాష్ రూమ్‌లు రిపేర్లులో ఉన్నాయి. ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. డ్రెయినేజీ నీరు నిల్వ ఉంటుంది. ఈ సమస్యను స్థానికులు అర్థం చేసుకుని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వాటర్ పైపులైన్ నిర్మాణానికి సహకరించాలి.

–రాధామోహన్, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్

క్లుప్తంగా

రామయ్య సేవలో ఖమ్మం జిల్లా జడ్జి



భద్రాచలంలో జడ్జికి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఉద్యోగి

భద్రాచలంటౌన్/పాల్వంచరూరల్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారిని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అధికారులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. అలాగే, పాల్వంచ మండలంలో కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారిని కూడా జిల్లా జడ్జి రాజగోపాల్ దర్శించుకుని పూజలు చేశారు. కాగా, పెద్దమ్మతల్లి అమ్మవారిని పాల్వంచ పట్టణ ఎస్‌ఐ సుమన్ సైతం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

అవినీతిపై ఫిర్యాదు చేయండి



విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాల్ స్టిక్కర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అవినీతి రహిత వ్యవస్థ ఏర్పాటుకు విద్యుత్ కార్యాలయాలు, సబ్ స్టేషన్లలో లంచం ఇవ్వకండి.. మాకు సమాచారం ఇవ్వండి.. లంచం ఇవ్వడం, తీసుకోవడం చట్టరీత్యా నేరం.. అనే వాల్ స్టిక్కర్లు, ఫోం బోర్డులను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ ఎస్‌ఈ భీకంసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి లేదా టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా 92810 33233 నంబర్‌కు సమాచారం తెలపాలని కోరారు.

మొక్కలు నాటితేనే ఉపయోగం



నాటిన మొక్కలను పరిశీలిస్తున్న డీపీఓ

గుండాల: అంతరిస్తున్న అడవులతో భవిష్యత్‌లో ఆక్సిజన్ లభించే పరిస్థితి ఉండదని, ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని డీపీఓ చంద్రమౌళి పేర్కొన్నారు. శుక్రవారం ఆళ్లపల్లిలో జరుగుతున్న స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొని పనులను పరిశీలించారు. రైతులకు మునగ మొక్కలపై అవగాహన పెంచాలని, ఉపాధి హామీ ద్వారా రైతులు పెంచుకోవచ్చని చెప్పారు. అనంతరం 3వ తేదీ నుంచి జరిగిన పనుల వివరాలను ఎంపీఓ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్‌లో మొక్కలు నాటారు. ప్లాంటేషన్ కింద 2 వేల మొక్కలు, మర్కోడు అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా 200 మొక్కలు నాటించామని చెప్పారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పేరిట బెదిరించిన నలుగురిపై కేసు

ఖమ్మంఅర్బన్: ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పేరిట శుక్రవారం ఖమ్మంలో కొందరు హల్‌చల్ చేశారు. నగరంలోని మమత ఆస్పత్రి రోడ్డులోని కింగ్ దర్బార్ హోటల్లోకి ప్రవేశించి లోపాలు ఉన్నాయని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో అనుమానం వచ్చిన హోటల్ యజమాని అసలు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో విషయం బయటపడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన గుగులోతు మోహన్‌రావు, బానోతు రామస్వామి, సపావత్ యువరాజ్, అజ్మీరా యువరాజుసింగ్ శుక్రవారం కింగ్ దర్బార్ హోటల్‌కు వచ్చి ఫుడ్ ఇన్‌స్పెక్టర్లుగా పరిచయం చేసుకున్నారు. ఆపై సరుకులు, ఆహార పదార్థాలను తనిఖీచేసి యజమానిని బెదిరిస్తూ డబ్బు డిమాండ్ చేశారు. దీంతో హోటల్ యజమాని ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చేలోగా నకిలీలు పారిపోయారు. అనంతరం ఘటనపై యజమాని ఇచ్చిన ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ (ఖానాపురం హవేలీ) సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

పాల్వంచరూరల్: కిరాణా దుకాణంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. నాగారం కాలనీలోని కిరాణా దుకాణంలో ఎస్‌ఐ బి.సురేశ్ తనిఖీలు నిర్వహించి, రూ.4,860 విలువ గల గుట్కాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. యజమాని ఇలాసాగరపు రాధమ్మపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

కుట్టుమిషన్లు ఎప్పుడిస్తారో?

- మైనార్టీ మహిళల కోసం గత ప్రభుత్వంలో కుట్టుమిషన్ పథకం ఏర్పాటు
- ఐదు నియోజకవర్గాలకు 500 మిషన్లు మంజూరు
- ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో మూలన..
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



మైనార్టీ మహిళల కోసం గత ప్రభుత్వం మంజూరు చేసిన కుట్టు మిషన్

పాల్వంచరూరల్: మైనార్టీ మహిళల కోసం గత ప్రభుత్వం ఉచిత కుట్టుమిషన్ పథకం ఏర్పాటు చేసి, కుట్టు మిషన్లు మంజూరు చేసింది. ఆ మిషన్లు వచ్చి ఏడాదైనా నేటికీ వాటిని పంపిణీ చేయలేద. దీంతో మైనార్టీ మహిళలు ఎదురుచూస్తున్నారు. ఏడాది కిందట నిరుపేద మైనార్టీ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం గత ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఉచిత కుటుమిషన్ల పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం కింద జిల్లాలోని భద్రాద్రి కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట నియోజకవర్గాలకు ఒక్కొక్క నియోజకవర్గానికి వంద చొప్పున మొత్తం ఐదు వందల కుట్టుమిషన్లు మంజూరు చేసింది. గతేడాది జూలై 20వ తేదీ నాటికి జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆయా నియోజకవర్గంలో నిరుపేద మైనార్టీ మహిళలు కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అర్హులను గుర్తించి ప్రజా ప్రతినిధుల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని అప్పటి ప్రభుత్వం సూచించడంతో ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయ లోపం కారణంగా పంపిణీ చేయడంలో జాప్యం జరిగింది. ఈలోగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కుట్టుమిషన్ల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. అయితే, ఒక్క పినపాక నియోజకవర్గంలో మాత్రం అక్కడి ఎమ్మెల్యే వంద కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో పంపిణీ చేయలేదు. కుట్టు మిషన్ల సామగ్రి గతేడాది అక్టోబర్‌లోనే రాగా.. వాటిని ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో మూలన పడేశారు.

త్వరగా పంపిణీ చేయాలి..



నిరుపేద మైనార్టీ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మంజూరైన కుట్టు మిషన్లను ఈ ప్రభుత్వమైనా వెంటనే పంపిణీ చేసి ఆదుకోవాలి. దరఖాస్తు చేసుకుని ఏడాది కాలంగా కుట్టుమిషన్ల కోసం ఎదురుచూస్తున్నాం. ఇంకా ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియడం లేదు. పలుమార్లు అధికారులు కలిసి విన్నవించినా ఫలితం లేకుండాపోతోంది. అధికారులు స్పందించాలి.

– ఎస్‌కే ఫజలున్నీసా, భద్రాచలం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



గత ప్రభుత్వం నిరుపేద మైనార్టీ మహిళల కోసం నియోజకవర్గానికి వంద చొప్పున కుట్టుమిషన్లు మంజూరు చేసింది. మొత్తం ఐదు వందల కుట్టుమిషన్లు జిల్లాకు వచ్చాయి. వాటిని అన్ని నియోజకవర్గాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు అందజేశాం. పినపాక నియోజకవర్గంలో పంపిణీ చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత నూతన ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఆదేశాలు వస్తే పంపిణీ చేస్తాం.

– సంజీవరావు, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి

ఎదురుచూస్తున్నాం



గతేడాది నిరుపేద మైనార్టీ మహిళల కోసం మంజూరైన కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నాను. మంజూరు చేసిన కుట్టుమిషన్ మాత్రం ఇంతవరకు పంపిణీ చేయలేదు. ఈ మిషన్లు ఎప్పుడు ఇస్తారోనని ఎదురుచూస్తున్నాం. ఎన్నికల నిబంధనలు ప్రస్తుతం లేవు. అప్పుడు కోడ్ వల్ల పంపిణీ నిలిపివేశామని అధికారులు తెలిపారు. తర్వితగతిన మిషన్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలి.

– ఎండీ షాజహా, చంద్రుగొండ

ఎన్నికల కోడ్ ముగిసినా..



గతేడాది ముస్లిం మైనార్టీ మహిళల కోసం మంజూరైన కుట్టుమిషన్లు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా పంపిణీ చేయకుండా అధికారులు నిలిపివేశారు. ఎన్నికల కోడ్ ముగిసి మూడు నెలలు కావొస్తున్నా నేటికీ మిషన్లు పంపిణీ చేయకుండా అధికారులు జాప్యం చేస్తున్నారు. ఇప్పటికైనా కుట్టుమిషన్లు లబ్ధిదారులకు పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి.

– ఎండీ యకూబ్‌పాషా, జిల్లా మైనార్టీ అధ్యక్షులు

ఖజానా కళకళలాడేలా..



- ఆదాయం పెంపుపై ఆర్టీసీ ప్రత్యేక దృష్టి
- శ్రావణమాసంలో అద్దె ప్రాతిపదికన బస్సులు
- శుభకార్యాలు, విహార యాత్రలకు రెడీ
- చార్జీలు, సౌకర్యాలపై జిల్లావ్యాప్తంగా అవగాహన

ఖమ్మంమయూరిసెంటర్: ఆదాయం వచ్చే ఏ మార్గా న్నీ వదులుకోకుండా ఆర్టీసీ యాజమాన్యం, అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా శ్రావణమాసంలో పెద్దసంఖ్యలో శుభకార్యాలు ఉండటం.. పుణ్యక్షేత్రాల యాత్రలకు కొందరు వెళ్లనున్న నేపథ్యాన బస్సులను అద్దెకు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. వినియోగదారుల సంఖ్య.. వారి అవసరాలను వెల్లడిస్తే చాలు అందుబాటులో ధరల్లో బస్సులు అద్దెకు ఇవ్వనుండగా.. ప్రైవేట్ బస్సులతో పోలిస్తే నిపుణులైన డ్రైవర్లు ఉన్న విషయమై అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ఏ బస్సు కావాలి?

ప్రయాణికులు ఎంచుకునే బస్సు ఆధారంగా అధికారులు చార్జీ వసూలు చేయనున్నారు. ప్రయాణ దూరం, ప్రయాణానికి పట్టిన సమయం ఆధారంగా అద్దె లెక్కిస్తారు. నాన్ ఏసీ బస్సులన్నింటికీ రన్నింగ్ సమయం గంటకు 30 కి.మీ. చొప్పున, ఏసీ బస్సుల రన్నింగ్ టైమ్ గంటకు 40 కిలోమీటర్ల చొప్పున లెక్కించనున్నారు. ఈ బస్సులకు ఎలాంటి డిపాజిట్ లేకపోగా.. అదనంగా పర్మిట్ ఫీజు, సర్వీస్ చార్జ్, టోల్ చార్జ్‌తో పాటు ఆరు శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని ఏసీ, గరుడప్లస్ ఏసీ బస్సులను అద్దెకు ఇస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఆర్టీసీలో సుశిక్షితులైన డ్రైవర్లు ఉండటం వల్ల శుభకార్యాలు, విహార యాత్రలకు క్షేమంగా వెళ్లిరావచ్చని చెబుతున్నారు.

కోరిన బస్సు అద్దెకు ఇస్తాం..



వివాహాది శుభకార్యాలు, పుణ్యక్షేత్రాలు, విహార యాత్రలకు వెళ్లే వారు సురక్షితంగా తిరిగొచ్చేలా ఆర్టీసీ తోడుంటుంది. ఆర్టీసీ బస్సుల్లో తక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణం చేసే వీలుంది. అటు ప్రయాణికులకు అందుబాటులో ఉండటమే కాక ఆర్టీసీకి ఆదాయం వచ్చేలా బస్సులను అద్దెకు ఇవ్వాలని నిర్ణయించాం. ప్రయాణికులు వారు వెళ్లి రావాల్సిన దూరం, ఆశించే సౌకర్యాల ఆధారంగా ఏ బస్సయినా ఎంచుకోవచ్చు. రీజియన్‌లోని ఏ డిపో నుంచి అయినా బస్సులు అద్దెకు అందుబాటులో ఉంటాయి. ప్రజలు వారి ప్రాంతాల్లోని డిపో మేనేజర్లను సంప్రదించి బస్సులను బుక్ చేసుకోవచ్చు.

– ఎ.సరిరామ్, ఖమ్మం రీజినల్ మేనేజర్

డిపోల వారీగా సంప్రదించాల్సిన సెల్ నంబర్లు

డిపో	నంబర్
ఖమ్మం	99592 25958
మధిర	99592 25961
సత్తుపల్లి	99592 25962
భద్రాచలం	99592 25960
కొత్తగూడెం	99592 25959
మణుగూరు	99592 25963

అద్దె బస్సులకు సంబంధించి ప్రయాణికులు, చార్జీల వివరాలు

బస్సు	ప్రయాణికుల సంఖ్య	చార్జీ(కి.మీ.కు) రూ.ల్లో	కనీస దూరం (కి.మీ)
మినీ పల్లెవెలుగు	31	41	200
పల్లెవెలుగు	55	68	200
ఎక్స్‌ప్రెస్	50	69	200
డీలక్స్	40	65	200
సూపర్ లగ్జరీ	36	65	300
డీలక్స్	48	77	300
(రాజధాని కన్వర్షన్)			
రాజధాని	40	84	400
గరుడ ప్లస్	49	119	400

పాలేరు టు పర్ణశాల

- పర్యాటక అభివృద్ధికి మంత్రి తుమ్మల ప్రతిపాదనలు
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లితో భేటీ



మంత్రి జూపల్లితో మాట్లాడుతున్న తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం జిల్లాలోని పాలేరు నుంచి భద్రాద్రి జిల్లాలోని పర్ణశాల వరకు పర్యాటక అభివృద్ధి అవకాశమున్నందున నిధులు మంజూరు చేయాలని పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావును వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. హైదరాబాద్‌లో జూపల్లిని కలిసిన తుమ్మల ఈనెల 12న ఖమ్మం వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. పాలేరు రిజర్వాయర్ జాతీయ రహదారికి సమీపాన ఉండడం.. పక్కనే దేశంలోనే రెండో అతిపెద్ద శివలింగం కొలువైన కూసుమంచి శివాలయం ఉందని తెలిపారు. అంతేకాక దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన నేలకొండపల్లి బౌద్ధస్థూపం, భక్తరామదాసు ధ్యాన మందిరం ఉండగా.. ఖమ్మం ఖిల్లాపై రోప్‌వే, లకారం ట్యాంక్ బండ్, వెలుగుమట్ల అర్బన్ పార్క్, వైరా రిజర్వాయర్, కిన్నెరసాని ప్రాజెక్టు, భద్రాచలం కరకట్ట వద్ద పర్యాటకంగా అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వీటికి తోడు భద్రాచలం రామాలయం, సింగరేణి గనులు, కేటీపీఎస్, భార జల కర్మాగారాలు ఉన్నందున వినోదంతో పాటు విజ్ఞానం పెంచొచ్చని మంత్రి తుమ్మల వివరించారు. దీంతో ఈనెల 12న క్షేత్రస్థాయి పరిశీలనకు రానున్న మంత్రి జూపల్లి చెప్పారని వెల్లడించారు.

11న మంత్రి ఉత్తమ్ పర్యటన

రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి 11వ తేదీన జిల్లాలో పర్యటిస్తారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ప్రాజెక్ట్ పంప్ హౌస్–2, కమలాపురం వద్ద పంప్ హౌస్–3 ట్రయల్ రన్‌కు ఆయన శంకుస్థాపన చేయడంతో పాటు పంప్ హౌస్ వద్ద నుండి వైరా లింక్ కెనాల్ వరకు ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలిస్తారని పేర్కొన్నారు. అలాగే, వైరాలో సీఎం రేవంత్‌రెడ్డి సభకు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించనున్నట్లు మంత్రి తెలిపారు.

సెర్ప్ ఉద్యోగుల బదిలీలకు కమిటీ..

చుంచుపల్లి: ఇటీవల వివిధ ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం బదిలీల ప్రక్రియను నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే ఈ బదిలీల్లో సెర్ప్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు అవకాశం కల్పించకపోవడంతో ఈ నెల 3న 'బదిలీ భాగ్యమేది'..? అనే శీర్షికన 'సాక్షి'లో కథనం కూడా ప్రచురితమంది. కాగా, ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగుల బదిలీలకు సంబంధిచిన ప్రక్రియకు ఐదుగురు డైరెక్టర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సెర్ప్ సిబ్బంది బదిలీలకు చేపట్టాల్సిన అంశాలను ఉద్యోగుల నుంచి సేకరించి, నివేదికను సెర్ప్ సీఈఓకు అందజేనుంది. దాని ప్రకారం బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు.

'సీతారామ' ప్రారంభం పేరుతో మోసం



బీజీ కొత్తూరు వద్ద ప్రాజెక్ట్ మ్యాప్‌లు పరిశీలిస్తున్న నాయకులు

అశ్వాపురం: మండలంలోని కుమ్మరిగూడెం వద్ద సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం పేరుతో జిల్లా రైతులను మోసం చేస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య అన్నారు. మండలంలోని బీజీకొత్తూరులోని సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌ను, కెనాల్ పనులను సీపీఎం నాయకుల బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఐలయ్య విలేకరులతో మాట్లాడారు. సీతారామ ప్రాజెక్ట్‌ను గోదావరి బ్యాక్ వాటర్‌తో నిర్మించాల్సిందని, ప్రాజెక్ట్ ఇంకా పూర్తి కాలేదని, దీంతో గోదావరి బ్యాక్ వాటర్ వచ్చే అవకాశం లేదన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, పైగా ఆ ప్రాజెక్ట్ కింది భాగంలో కెనాల్ నిర్మించారని, లాక్‌లు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. కేవలం వర్షపునీటితో సీతారామ ప్రాజెక్ట్‌ను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధపడిందని విమర్శించారు. రెండో పంప్‌హౌస్‌ను ముఖ్యమంత్రి ఈ నెల 15న ప్రారంభిస్తారని ప్రకటించి అక్కడ వర్షపు నీరు నిల్వ చేశారని, గోదావరి నీరు అక్కడికి రాదని, ఇది జిల్లా ప్రజలను మోసం చేయడమేనని మండిపడ్డారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ పూర్తి చేసి మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించి మిగిలిన జలాలు ఇతర ప్రాంతాలకు తరలించాలని, లేనిపక్షంలో రైతాంగాన్ని సమీకరించి నీటి విడుదలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యలమంచిలి వంశీకృష్ణ, అన్నవరపు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కొండబోయిన వెంకటేశ్వర్లు, సాంబశివరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు, నాయకులు స్వర్ణం బాలనర్సయ్య, నెల్లూరు నాగేశ్వరరావు, మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, పాయం నరసింహారావు, భద్రయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్వచ్ఛదనం- పచ్చదనం



చుంచుపల్లి మండలంలో పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది

చుంచుపల్లి: జిల్లాలో ఐదు రోజుల పాటు నిర్వహించిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ఈ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రజలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, పంచాయతీ సిబ్బంది భాగస్వాములయ్యారు. కార్యక్రమాలలో భాగంగా శ్రమదానాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆర్టీసీ బస్టాండ్లు, హెల్త్ సెంటర్లలో విస్తృతంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ప్రజలను చైతన్య పరచడానికి గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో ర్యాలీలు నిర్వహించారు. రహదారులు, వీధుల వెంబడి నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. అవగాహన సమావేశాలను నిర్వహించి పచ్చదనం పరిశుభ్రతపై చర్చించారు. పాఠశాలల విద్యార్థులకు పారిశుద్ధ్యంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

ఐదు రోజులు నిర్వహించిన అంశాలు

స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా నిర్వహించిన అవగాహన ర్యాలీల్లో 18,721 మంది పాల్గొన్నారు. 476 గ్రామాల పరిధిలో ఉన్న 610 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పచ్చదనం, పరిశుభ్రతపై స్పీచ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాలో 2,211 కిలోమీటర్ల మేర రహదారులను శుభ్రం చేశారు. జిల్లాలో 650 కిలోమీటర్ల డ్రెయినేజీ వ్యవస్థను పరిశుభ్రం చేశారు. ఇక ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ సెక్టార్లకు సంబంధించిన 3,053కార్యాలయాల ప్రాంగణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లాలో 14,891 మంది శ్రమదానం కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. 2,02,383 ఇళ్లకు ఇంటింటికీ ఆరు మొక్కల చొప్పున 12,32,862 మొక్కలను పంపిణీ చేశారు. వనమహోత్సవంలో భాగంగా ఈ ఐదు రోజుల పాటు 68,700 మొక్కలను 803 ప్రాంతాల్లో నాటారు. అదే విధంగా ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా 339 ప్రాంతాల్లో 1,09,478 మొక్కలు నాటారు. జిల్లాలో ఎమ్మెల్యేలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు 13 చోట్ల ఈ కార్యక్రమాలకు హాజరుకాగా, మొత్తం మీద 140 మంది జిల్లాస్థాయి అధికారులు పలు ప్రాంతాల్లో భాగస్వాములయ్యారు.

తాగునీరు అనుకుని దోమల మందు తాగి..

అస్వస్థతకు గురైన పారిశుద్ధ్య కార్మికురాలు



ఓదమ్మను పరామర్శిస్తున్న కమిషనర్, సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: తాగునీరు అనుకుని దోమల నివారణకు వినియోగించే మందును తాగిన పారిశుద్ధ్య కార్మికురాలు అస్వస్థతకు గురైంది. వివరాలిలా ఉన్నాయి.. 8వ వార్డులో పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికురాలిగా పనిచేస్తున్న ఓదమ్మ.. శుక్రవారం విధులు నిర్వహిస్తున్న క్రమంలో దాహం వేయడంతో మంచినీళ్ల బాటిల్ అనుకొని, మలాథియాన్ ద్రవం ఉన్న బాటిల్ తీసుకొని తాగింది. దీంతో గొంతులోకి కొంత వెళ్లగా మిగిలిన ద్రవాన్ని ఉమ్మివేసింది. విషయాన్ని తనతో పాటు పని చేస్తున్న తోటి కార్మికులకు తెలుపడంతో ఆమెను వెంటనే కొత్తగూడెం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఓదమ్మ పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కాగా, ఓదమ్మను మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్‌స్వామి పరామర్శించారు.

మిరప నారుమడిపై విష ప్రయోగం

కన్నీరుమున్నీరైన రైతు కుటుంబం

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడులో మిరప నారుమడిపై గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయగా నారు పూర్తిగా మాడిపోయింది. గ్రామానికి చెందిన రైతు కేలోత్ చంద్రం – లలిత మిరప సాగు చేసేందుకు పొలంలోనే నారు పోశారు. పదిరోజుల్లో నాటాలని భావిస్తుండగా ఏపుగా పెరిగిన నారుపై గుర్తు తెలియని వ్యక్తులు కలుపు మందు చల్లినట్లు భావిస్తుండగా శుక్రవారం పూర్తిగా మాడిపోయింది. దీంతో బాధిత రైతు కుటుంబం కన్నీరుగా విలపిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రాణాపాయ స్థితిలో విద్యార్థి



చికిత్స పొందుతున్న సాయికిరణ్

సింగరేణి(కొత్తగూడెం): భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలోని బీసీ గురుకులంలో ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితికి చేరాడని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా జిల్లా కార్యదర్శి వీరభద్రం ఆరోపించారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలానికి చెందిన దండుగుల సాయికిరణ్, మరో విద్యార్థి నడుమ ఘర్షణ జరగగా సాయికిరణ్‌కు తీవ్రగాయాలు కావడంతో ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారని తెలిపారు. ఆయనకు ఆపరేషన్ చేయాలంటే రూ.లక్ష ఖర్చవుతుందని చెప్పడంతో కుటుంబం ఇబ్బంది పడుతోందని చెప్పారు. ఈ విషయంలో అధికారులెరూ పట్టించుకోవడం లేదని విద్యార్థి కుటుంబం వెల్లడించిందని తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని వీరభద్రం కోరారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం గ్రామ పంచాయతీ ఎల్లాపురం తండాకు చెందిన గుగులోత్ సతీశ్ (23) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఈ నెల 5వ తేదీన గ్రామ రైతులు పిలవడంతో విద్యుత్ స్తంభంపై పనులకు వెళ్లాడు. స్తంభంపై ఉండగానే విద్యుదాఘాతానికి గురై పైనుంచి కింద పడ్డాడు. స్థానికులు ఇల్లెందు ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మంకు.. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సతీశ్ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు. కాగా, మృతుడి కుటుంబాన్ని ట్రాన్స్‌కో ఆదుకుంటుందని ఏడీఈ కోటేశ్వరరావు తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అన్నపురెడ్డిపల్లి: కోడి పందేల స్థావరంపై శుక్రవారం స్థానిక పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. మండలంలోని రాజాపురం గ్రామ శివారులోని జామాయిల్ తోటలో కోడి పందేలు నిర్వహిస్తుండగా, సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3 వేల నగదు, రెండు కోడి పుంజులు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.